## కామెడీ కథ

# (సీ)రియల్ స్టోరీ

**జి. పూర్ణిమ**

**"ఓసి నా అత్తో! ఎంత అందంగా ఉన్నావే, నీ కూతుళ్ళు నీ ముందు బలాదూరే, నా సామిరంగా ఇంక చూడు ఎలా ఇరగదీస్తానో"**

**వెంటనే 'సయ్యా సయ్యా' అంటూ పాట మొదలు అయ్యింది.**

కడుపులో దేవినట్లయింది రాణికి. 'అత్తా అల్లుళ్ళ' పేరుతో టీవీలో వస్తున్న సినిమా చూడలేక ఛీ ఛీ అనుకుంటూ ఛానల్ మార్చింది. ఏదో సీరియల్ టైటిల్‌సాంగ్ 'ఇదే మంగళ్యానికి నాలుగో ముడి' అంటూ టైటిల్ సాంగ్‌లోనే స్త్రీ పాత్రధారులంతా భోరున ఏడుస్తూ కనిపించారు. ఇదో ఏడుపుగొట్టు సీరియల్ కాబోలు అనుకుంటూ ఛానల్ మార్చింది. అక్కడ ఏదో సీరియల్ వస్తోంది. హీరోయిన్ పాత్రధారిణి కన్నీళ్ళు ధారలు ధారలుగా కారుస్తూ డైలాగులు చెబుతోంది. అయిదు నిముషాలు గడిచినా చెప్పింది చెబుతూనే ఉంది. రాణికి అర్థం కాలేదు. అదేమిటి తెలుగులో చెప్పిన మాటని మళ్ళీ ఇంగ్లీషులో కూడా చెబుతోంది అనుకుంటూ ఉండగానే 'బ్రేక్' అని వాణిజ్య ప్రకటనలు మొదలయ్యాయి.

విసుగ్గా టి.వి. ఆపి లేచింది.

మధ్యాహ్నం మూడు కావస్తోంది. ఏం చెయ్యాలో తోచటం లేదు.

టీ కలుపుకుందామని వంటింట్లోకి వెళ్ళింది.

రాణికి కిరణ్‌తో పెళ్ళి జరిగి నెలరోజులు దాటింది. వారం క్రితమే కాపురానికి వచ్చింది. కొత్త కాపురానికి కావలసినవన్నీ సమకూర్చుకుని సర్దుకోవటంతోనూ, ఊరంతా తిరిగి చూడటంతోనూ వారం రోజులు గడిచిపోయాయి. కిరణ్ కూడా ఆ రోజునుంచే డ్యూటీలో జాయిన్ అయ్యాడు.

పెళ్ళికి ముందు వరకు కాలేజీ, చదువు, ట్యూషన్లు అంటూ తీరిక లేకుండా ఉన్న రాణికి ఆ రోజు ఎంతకీ గడవటం లేదు.

టీ కలుపుకుని బాల్కనీలో కూర్చుంది. ఎదురింట్లో పిల్లలు ఆడుకుంటున్నారు.

అది నాలుగు వాటాల ఇల్లు. అందులో నలుగురయిదుగురు ఒకే వయసు పిల్లలున్నారు. లత, రాజు, చంటి, చిన్ని. వాళ్ళ పేర్లు మాత్రమే వాళ్ళ గురించి ఈ వారం రోజులలో తెలుసుకుంది. కాలక్షేపం కోసం వాళ్ళ ఆట చూస్తూ కూర్చుంది.

''ఒసేయ్ విరజా ఇలా రావే'' పిలిచాడు రాజు.

ఒణికిపోతున్నట్లు నటిస్తూ పరిగెత్తుకు వచ్చింది లత.

''ఏమే ఎన్నిసార్లు చెప్పాలే నా బూట్లు సరిగ్గా పాలిష్ చెయ్యమని? నీకు ఒళ్ళు బాగా కొవ్వెక్కిందీ. మెడ పట్టుకుని బైటికి గెంటితే గాని నీకు బుద్ధి రాదు'' అంటూ లత మెడపట్టుకున్నాడు.

''ఏమండి అంత పని చెయ్యకండి. నన్ను కొట్టండి, చంపండి. కానీ ఇంట్లోంచి గెంటకండి. ఆడదాని బ్రతుకు భర్త పాదాల దగ్గరే కదండి'' అంటోంది లత.

చిన్ని, చంటి చప్పట్లు కొడుతూ ఒకరికొకరు షేక్‌హాండ్ ఇచ్చుకుంటున్నారు.

ఆ మాటలు వింటున్న రాణికి మతిపోయింది.

''పిల్లలూ ఇలా రండి'' పిలిచింది రాణి.

''ఏంటాంటీ'' అంటూ వచ్చారు.

''ఏంటమ్మా ఆ మాటలు. తప్పుకదూ. చిన్న పిల్లలు అలా మాట్లాడవచ్చా?''

''మేం నన్నే పెళ్ళాడు సీరియల్ ఆట ఆడుతున్నామాంటీ. నేనేమో విరజ, వీడేమో విమల్, చంటి, చిన్ని ఇద్దరూ విమల్ రెండో భార్య, మూడో భార్య. నేను మొదటి భార్యను. అందులో విమల్ రోజూ ఎవరో ఒకళ్ళని ఇలాగే మెడపట్టుకుని గెంటాలి'' సాధ్యమయినంత వివరంగా చెప్పడానికి ప్రయత్నించింది లత. ''ఇంక వెళ్తాం ఆంటీ. ఆట మధ్యలో వచ్చాం కదా'' అని పొలోమని పారిపోయారు.

'ఇదెక్కడి ఆటర్రా బాబూ' అనుకుంటూ ఇంట్లోకి వచ్చి కూర్చుంది. ఎదురు ఫ్లాట్‌లో ఎవరితో అయినా మాట్లాడదామంటే మధ్యాహ్నం అందరూ డైలీ సీరియల్స్‌తో బిజీగా ఉంటారని ఈ వారం రోజులలో గ్రహించింది.

మాధవి దగ్గరకెళితే...?

మాధవి తన క్లోజ్ ఫ్రెండ్. కాలేజీలో తను ఎక్కడ ఉంటే అక్కడ నవ్వుల జల్లులు కురిసేవి. తనకన్నా ఒక ఏడాది ముందే పెళ్ళి జరిగి హైదరాబాద్ వచ్చేసింది. ఇల్లు కూడా దగ్గర్లోనే. వెంటనే తయారయి తలుపు తాళం వేసింది రాణి. ముక్కు ఎగబీలుస్తున్న శబ్దం విని పక్కకు తిరిగి చూసింది. ఎదురింటి బామ్మగారు కళ్ళు తుడుచుకుంటూ కనిపించారు.

''ఏమైంది బామ్మగారూ ఒంట్లో బాలేదా'' ఆదుర్దాగా అడిగింది రాణి.

''ఏం చెప్పమంటావు తల్లీ. నా కోడలు లాంటి కోడలు ఉంటే ఇంకేం బాగుంటాను. విజయంలో సీతే నయమనుకో.''

''విజయంలో సీత ఎవరండీ?'' ఆశ్చర్యంగా అడిగింది.

''అయ్యో రోజూ వచ్చే డైలీ సీరియల్ నువ్వు చూడవా'' ఎనిమిదో వింత చూస్తున్నట్లు ఆశ్చర్యపోయారు బామ్మగారు.

''సరే ఆ సీరియల్‌కు, మీ కోడలికీ సంబంధమేంటి?''

''అలా మెల్లగా అడుగుతున్నావేమిటమ్మాయ్. అందులో అత్తగారికి కోడలు పాలల్లో విషం కలిపిచ్చినట్లు నా కోడలు కూడా నా కాఫీలో ఏదో మాత్రలు కలుపుతుండటం చూసాను. నన్ను చంపాలనే అలా చేస్తోంది''

అస్సలు అర్థం కాలేదు రాణికి. ''మిమ్మల్ని చంపాల్సిన అవసరం ఆవిడకు ఏమిటండీ''

''అత్త బ్రతికి ఉండటం ఏ కోడలికి నచ్చుతుంది కనుక, ఎన్ని సీరియల్స్‌లో చూడటం లేదూ'' దీర్ఘం తీసింది.

''అత్తయ్యగారూ పంచదార లేకుండా కాఫీ తాగలేకపోతున్నానంటున్నారు కదా. షుగర్ ఫ్రీ టాబ్లెట్లు కలుపుకుంటే బాగుంటుందని షాపువాడు చెప్పాడు. త్రాగి చూడండి'' అంటూ వాళ్ళ కోడలు కాఫీ గ్లాసుతో వచ్చింది.

నవ్వాపుకుంటూ బైటకు నడిచింది రాణి.

మాధవి ఇల్లు తేలిగ్గానే దొరికింది. చిన్ననాటి స్నేహితురాలిని చూడబోతున్నాననే ఉత్సాహంతో కాలింగ్ బెల్ నొక్కింది.

రెండు నిముషాల తర్వాత తలుపు తెరిచిన మాధవిని చూసి నిర్ఘాంతపోయింది రాణి. రేగిపోయిన జుట్టు, ఉబ్బిన కళ్ళు, ఇంకా వెక్కిళ్ళు ఆగలేదు వస్తూనే వున్నాయి.

''మాధవీ ఏం జరిగింది, ఎందుకు ఏడుస్తున్నావు?''

''రాణీ నా బ్రతుకు అన్యాయమయిపోయిందే. విరు, సుప్రతిజ్ఞలకన్నా దారుణంగా మారిందే నా పరిస్థితి''

''విరు, సుప్రతిజ్ఞా, వాళ్ళెవరూ? కొత్తగా ఇక్కడ ఉన్న నీ ఫ్రెండ్సా, సరే, ముందు కళ్ళు తుడుచుకుని మొహం కడుక్కునిరా. తర్వాత మాట్లాడుకుందాం''


'హు..' అంటూ నవ్వింది మాధవి ''కళ్ళు తుడుచుకుని ఏం ప్రయోజనం? ఆడపుట్టుక పుట్టాక ఆగమంటే ఆగేవా ఈ కన్నీళ్ళు'' ఎటో చూస్తూ మాట్లాడింది.

''సరే ఇప్పుడు నీకేం కష్టం వచ్చింది. ఎందుకు ఏడుస్తున్నావో చెప్పు''

''హు..ఆడపుటకే కష్టం. కష్టంలో పుట్టి కష్టంలో పెరుగుతూ కష్టంలోనే చస్తాం. ఇంకా కష్టాలకు భయపడి కష్టపడాలా''

తల గోడకేసి బాదుకోవాలనే కోరికను బలవంతంగా అణుచుకుంటూ ''ఏంటి మాధవీ జరిగిందేమిటో చెప్పకుండా ఏదేదో మాట్లాడుతున్నావు. శేఖర్‌కీ నీకూ ఏమన్నా గొడవ జరిగిందా. నాకు తెలిసీ శేఖర్ చాలా మంచి వాడు, నెమ్మదస్తుడేగా''

''హు. మగవాడె



టమే

ప్పుడూ మంచిగానే కనపడతాడు'' మళ్ళీ శూన్యంలోకి చూడటం మొదలుపెట్టింది.

''మాధవీ ఒకటడుగుతాను, ఏమనుకోవు కదా''

''హు..ఎవరు ఏమన్నా ఏమనుకోకుండా ఉండ

ఈ ఆడబ్రతుకు నువ్వు నా ఫ్రెండువి. ఎందుకనుకుంటాను. అడుగు.''

''ప్రతి మాటకు ముందు 'హు' అని నవ్వుతున్నావు. నా వైపు చూడకుండా ఎటో చూస్తున్నావు. ఎందుకే?''

ఆశ్చర్యంగా అడిగింది రాణి.

అరికాలి మంట నెత్తికెక్కింది మాధవికి. ''నేను విరక్తిగా నవ్వుతూ, మాట్లాడుతూ ఉంటే నన్ను వేళాకోళం చేస్తున్నావా!''

''అయ్యోరామా! వేళాకోళం కాదూ నిజంగా తెలీకే అడిగాను.''

''ఏంటే తెలియంది. రోజా సుప్రతిజ్ఞ, విరిలను చూస్తూ కూడా తెలీదంటావు''

''అవునూ, మర్చిపోయాను. ఇంతకీ వాళ్ళెవరే తల్లీ, నేనొచ్చినప్పటి నుండీ వాళ్ళ గురించే నీ జపం''

''అదేంటీ ఊటబావులు, పట్టీల చప్పుడు సీరియల్స్ చూడవా నువ్వు''

''ఊటబావులా, అదేం పేరు'' ఆశ్చర్యంగా అడిగింది రాణి.

''అందులో హీరోయిన్ సుప్రతిజ్ఞ రెండు కళ్ళు ఊటబావుల్లాగా ఎప్పుడూ నిండుగా నీళ్ళతోనే ఉంటాయి మరి''

''సరిపోయింది. ఇక్కడా సీరియల్స్ గొడవేనా'' ఉసూరంది రాణి.

''సరే సీరియల్స్ గొడవ ఒదిలెయ్యి. ఏంటి నీ ప్రాబ్లమ్. ఎందుకు ఏడ్చావ్''

''ప్రాబ్లమ్ అని మెల్లగా అడుగుతావేంటి. మా ఆయనతోనూ, అత్తగారితోనూ వేగలేక ఛస్తున్నాననుకో''

''మీ అత్తగారు అసలు ఇక్కడ ఉండరు కదా. ఆవిడతో నీకేంటి బాధ. శేఖర్ ఎలాగూ చాలా కామ్ గోయింగ్''

''ఇది మరీ బాగుంది. అత్తగారు ఇక్కడ లేకపోతేనేం? తల్లీ కొడుకులిద్దరూ ఫోన్‌లో మాట్లాడుకోరా ఏంటి. ఏం మాట్లాడుకుంటున్నారో విందామని ఎక్స్‌టెన్షన్ ఫోన్ పెట్టించమంటే మా ఆయన ఒప్పుకోడు'' కసిగా పళ్ళు కొరుకుతూ చెప్పింది.

''ఎక్స్‌టెన్షన్‌లో వినటం ఎందుకే. మీ ఆయన్నే డైరెక్టుగా అడగొచ్చు కదా.''

''అయ్యో పిచ్చిమొద్దా సీరియల్స్ చూడక అస్సలు జనరల్ నాలెడ్జ్ లేకుండా పోయినట్లుంది నీకు. అలా వాళ్ళు మాట్లాడుకుంటూ ఉంటే మనం సీక్రెట్‌గా వినాలి. ఎందుకు చెబుతున్నానో అర్థం చేసుకో. పాపం అసలే కొత్తగా పెళ్ళయినదానివి'' సానుభూతి చూపించింది.

''అదంతా సర్లేగాని ఇందాక ఎందుకు ఏడ్చావో చెప్పమంటే చెప్పవే. ఇదిగో ఆగాగు. మళ్ళీ హు ఆడపుట్టక అని మాత్రం మొదలుపెట్టకు'' కంగారుగా చెప్పింది రాణి.

''నీకు మరీ వేళాకోళంగా ఉందే. మా పిన్నికొడుకు బావమరిది పెళ్ళి రిసెప్షన్ ఇవాళ సాయంత్రం. తొందరగా వెళదామంటే ఆఫీసులో అర్జెంట్ మీటింగ్ ఉంది లేటవుతుందని సాకు చెప్తున్నారు ఈయన. వాళ్ళ అమ్మ ఎంత చెప్తే అంతే కదా!''

''మీ అత్తగారు చెప్పారని నీకెలా తెల్సు. మీ ఆయన చెప్పారా, నువ్వు విన్నావా. నిజంగానే మీటింగ్ వుండి వుంటుంది''

''అవన్నీ మనం వినేట్టు మాట్లాడుకుంటారా ఏంటి. పేదవాళ్ళ కోడలు, శ్రావ్య మంజరి అన్న సీరియల్స్‌లోనూ మనం రోజూ చూసే ట్రిక్కులే కదా ఇవన్నీ.''

మాధవి పూర్తిగా డైలీ సీరియల్స్ మత్తులోనే ఉందని రాణికి పూర్తిగా అర్థమయ్యింది. అయినా ఆశ చావక అడిగింది. ''నువ్విదివరకు చాలా బాగా పెయింటింగ్స్ వేసేదానివి కదా! ఇప్పుడూ వేస్తున్నావా?''

''టైమెక్కడే తల్లీ! ప్రొద్దున్న పదినుంచీ రాత్రి పది వరకు సీరియల్స్ వస్తూనే వుంటాయి. మా ఆయన అంటారు. టీవీ చూడటం మానేసి పెయింటింగ్ ఇంప్రూవ్ చేసుకోవచ్చు కదా అని. తన వేషాలన్నీ కనిపెట్టేస్తున్నానని కుళ్ళు. నేను ఒప్పుకోననుకో''


కళ్ళు చక్రాల్లా తిప్పుతూ గొప్పగా చెప్పింది మాధవి.

ఇంకేం మాట్లాడాలనిపించలేదు రాణికి. ''సరే ఇంక వస్తాను'' అంటూ లేచింది.

''అదేంటి ఇప్పుడు మరదలు సీరియల్ వస్తుంది. భలే బావుంటుందనుకో. ఇంతవరకు జరిగిన కథ నేను చెప్తాలేగానీ దా చూద్దాం'' సాదరంగా ఆహ్వానించింది.

## అవే ఇష్టం

**తెరమీది కన్పించి, కవ్వించే తారలకి కొన్ని అభిరుచులు ఉంటాయి. అందాలతార బిపాషాబసుకి రోజూ త్వరగా నిద్రలేవడం అంటే ఎంతో ఇష్టంట. జీన్స్, బెల్ట్స్, బ్యాగ్‌లు, షూలు ఆమె వార్డ్ రోబ్‌లో ఎక్కువగా కన్పిస్తాయిట. అన్నట్టు ఆమె తన బాయ్‌ఫ్రెండ్ జాన్‌ని కూడా ఆకాశానికెత్తేస్తుంది. 'జాన్ చాలా మంచి ఫ్రెండ్. ఎలాంటి భేషజాలు ఉండవు. ఎప్పుడూ అందుబాటులో ఉంటాడు. నాకు అన్నిరకాలుగా సలహాలిస్తుంటాడు' అంటోంది. అంటే ఆమె బాయ్‌ఫ్రెండ్ ఎన్నిక కరెక్టేనన్నమాట.**



''వద్దు తల్లీ నువ్వు చూడు. నేను వెళ్తున్నాను'' ఒక్క గెంతులో బయటపడి రోడ్డెక్కింది రాణి.

దారంతా ఒకటే ఆలోచనలు. ఏమయింది అందరికీ. డ్రగ్ ఎడిక్షన్, డ్రింక్ ఎడిక్షన్ లాగా సీరియల్స్‌కి ఎడిక్ట్ అయిపోయారు అంతా.

ఆడవాళ్లంటే ఏడుస్తూ ఉండాలన్నట్టు వాళ్ళు చూపిస్తున్నారు. అవన్నీ చూసి లేని కష్టాలను ఆపాదించుకుని, వీళ్ళంతా ఏడుస్తున్నారు.

రేపు తను కూడా ఇలా అయిపోతుందా..? ఒక్కసారిగా భయం వేసింది. లేదు, లేదు రేపట్నుంచీ ఏదో ఒక వ్యాపకం పెట్టుకోవాలి.

లేకపోతే ఇంట్లో వుండి తోచక తనూ అదే బాటలో నడుస్తుంది. ప్రొద్దున్న పేపర్లో చూసిన కంప్యూటర్ కోర్సెస్ ప్రకటనలు మనసులో మెదిలాయి. ఉత్సాహంతో వడివడిగా ఇంటి వైపు అడుగులు వేసింది రాణి.